క్లుప్తంగా

బాల్య వివాహాలతో భవిష్యత్ బుగ్గి



కూడేరు: మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీదేవి

కూడేరు: బాల్య వివాహాలతో అమ్మాయి ఉజ్వల భవిష్యత్ నాశనమవుతుందని సీడీపీఓ శ్రీదేవి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2,3లో పొట్టి శ్రీరాములు వర్ధంతిని అంగన్‌వాడీ సిబ్బంది, గర్భి ణులు, బాలింతలు, చిన్నారులతో కలిసి సీడీపీఓ జరుపుకున్నారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ రాజేశ్వరి, ఏఎన్ఎం చంద్రకళ, అంగన్‌వాడీ కార్యకర్తలు కళావతి, నాగలక్ష్మీ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

వజ్రకరూరు: పీసీ చిన్నప్యాపిలికి చెందిన బొబ్బిలిహనుమంతరెడ్డి (58) విద్యుదాఘాతంతో శనివారం మృతిచెందాడు. వివరాలు.. పీసీ చిన్నప్యాపిలికి చెందిన హనుమంతరెడ్డి ఏడు ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నాడు. హనుమంతరెడ్డి అప్పుడప్పుడు మిద్దెపైన నిద్రించేవాడు. శుక్రవారం రాత్రి భోజనం చేసిన తర్వాత మిద్దెపైకి వెళ్లి నిద్రించాడు. ఉదయం 9 గంటలు దాటినా నిద్రలేవకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూశారు. అప్పటికే విద్యుదాఘాతానికి గురైనట్లు గుర్తించారు. వెంటనే అతన్ని 108 వాహనంలో ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి, అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హంద్రీనీవా కాలువలో గుర్తుతెలియని శవం

వజ్రకరూరు: మండలంలోని రాగులపాడు సమీపంలోని హంద్రీనీవా ఎత్తిపోతల పథకం వద్ద శనివారం రాత్రి గుర్తు తెలియని శవం కొట్టుకొచ్చింది. శవాన్ని గుర్తుంచిన అక్కడ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వయసు 40 ఏళ్లు ఉంటుందని, రాత్రి వేళ కావడంతో ఆదివారం శవాన్ని వెలికితీయిస్తామని ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు.

వజ్రకరూరులో చోరీ

వజ్రకరూరు: మండల కేంద్రంలోని నాగులబావి ఏరియాలో నివాసం ఉంటున్న షేక్‌హాజ అనే మహిళ ఇంట్లో శనివారం చోరీ జరిగింది. వివరాలు.. షేక్ హాజ ఈనెల 3న అనంతపురం వెళ్లింది. శనివారం మధ్యాహ్నం ఇంటికి చేరుకోగా, తాళాన్ని ధ్వంసం చేసిన విషయాన్ని గుర్తించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాను పగులగొట్టి అందులోని 3.5 తులం బంగారు, రెండు పట్టీలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించింది. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ నాగస్వామి, క్లూస్‌టీం అక్కడకు చేరుకొని పరిశీలించారు.


రాజీమార్గానికి అత్యుత్తమ వేదిక లోక్ అదాలత్



లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న జడ్జి సుభాన్

రాయదుర్గంటౌన్: కక్షిదారులు రాజీమార్గంతో కేసులను పరిష్కరించుకునేందుకు అత్యుత్తమ వేదిక జాతీయ లోక్ అదాలత్ అని ఇన్‌చార్జ్ జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ బి.సుభాన్ పేర్కొన్నారు. శనివారం రాయదుర్గం కోర్టులో జడ్జి ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ జరిగింది. జడ్జి మాట్లాడుతూ రాజీకి ఆమోదయోగ్యమైన క్రిమినల్, సివిల్‌తోపాటు ఇతరాత్ర కేసులకు శాశ్వతంగా పరిష్కారం లభిస్తుందన్నారు. శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో రాజీమార్గంతో వివిధ రకాల కేసులను పరిష్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం



జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి సుజన్ కుమార్

కళ్యాణదుర్గం రూరల్: రాజీ మార్గమే రాజమార్గం అని జూనియర్ సివిల్ జడ్జి సుజన్ కుమార్ పేర్కొన్నారు. శనివారం కళ్యాణదుర్గం కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. కళ్యాణదుర్గం కోర్టులో వివిధ కేసుల్లో కేసు నమోదు అయిన 606 కేసులు జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ అయ్యారు. న్యాయమూర్తి మాట్లాడుతూ గొడవలు, పంతాలకు పోయి పోలీస్ కేసు ల దాకా పోవడం సరికాదన్నారు. నిరంతరం కోర్టుల చుట్టూ తిరగకుండా లోక్ అదాలత్‌లో రాజీ అయ్యి, ప్రశాంత జీవనం సాగించాలన్నారు.

మచ్చంద్రమయ్య జలధి

కుందుర్పి: కొలిమిపాళ్యం గ్రామంలో శ్రీమచ్చంద్రమయ్య జలధి ఉత్సవం నేత్రపర్వంగా జరిగింది. స్వామిని వివిధ రూపాల్లో అలంకరించి కర్ణాటక సరిహద్దున ఉన్న జోడుకాలువల వద్దకు గ్రామోత్సవంగా తీసుకెళ్లి గంగపూజ చేశారు. సాయంత్రం ఆలయంలో అంకుర్పాణం, కలశస్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

పశుగ్రాసం.. భలే బేరం

- వరిగడ్డి సేకరణకు పాడి రైతుల పాట్లు
- ట్రాక్టరు గడ్డి రూ.8 వేల నుంచి రూ.12 వేల ధర
- ధర పెరుగుదలతో రైతుల ఆందోళన



కణేకల్లు నుంచి వరిగడ్డిని ట్రాక్టర్‌లో గుంతకల్లుకు తీసుకెళ్తున్న దృశ్యం



విడపనకల్లు సమీపంలో వరి పంట తొలగిస్తున్న కూలీలు

ఉరవకొండ: ఏటేటా వర్షాభావంతో వేరుశనగ పంట దెబ్బతింటోంది.. ఎక్కువ విస్తీర్ణంలో వేరుశనగ సాగు చేయకపోవడంతో గ్రాసం (వేరుశనగ కట్టె) దొరక్క రైతులు, పాడి రైతులు అవస్థలు పడాల్సి వస్తోంది. దీనికితోడు వరి గ్రాసానికి భలే డిమాండ్ పెరిగింది. పాడి రైతులు పశువులకు గ్రాసం దొరక్క నానా తిప్పలు పడుతున్నారు. దీంతో గ్రాసం ధరలు అమాంతం పెరిగిపోయాయి.

ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల పరిధిలో ఈ దఫా 14,622 హెక్టార్లలో వరి పంట సాగుచేశారు. డివిజన్ పరిధిలో కణేకల్లు, విడపనకల్లు, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ మండలాల్లో 80 శాతం మంది రైతులు వరిసాగు చేశారు. దీనికి తోడు వరి కోత కోసే యంత్రాలతో పాటు కూలీలకు మార్కెట్లో డిమాండ్ పెరగడం, ఎకరా విస్తీర్ణంలో వరి కోత కోసం, కుప్ప వేయడానికి కూలీలకు రూ.8 వేలు ఖర్చుపెట్టాల్సి వచ్చింది. దీంతో వరి గ్రాసానికి డిమాండ్ పెరిగింది.

ట్రాక్టరు గడ్డి రూ.12 వేలు

వరి గ్రాసానికి భారీ డిమాండ్ ఏర్పడటంతో ట్రాక్టర్ గడ్డి రూ.8 వేల నుంచి రూ. 12 వేల ధర పలుకుతోంది. కొందరు రైతులు వరి గ్రాసం ధర అధికంగా ఉంటే వేరుశనగ పొట్టు కొనుగోలు చేసేవారు. కొన్నేళ్లుగా వేరుశనగ సాగు గణనీయంగా తగ్గడంతో రైతులు వరిగడ్డి పైనే ఆధారపడాల్సి వస్తోంది. జిల్లాలోని మిగితా మండలాలకు కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, విడపనకల్లు మండలాల నుంచే గడ్డి సరఫరా కావాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం కనీసం రాయితీతో వరిగడ్డి అందించి ఆదుకోవాలని పశుపోషకులు కోరుతున్నారు. మార్కెట్లో అంత ధర పెట్టి గ్రాసం కొనలేమని రైతులు, పశుపోషకులు అంటున్నారు.

ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో పశువుల సంఖ్య ఇలా..

నియోజకవర్గం	పశువుల సంఖ్య
ఉరవకొండ	72,500
రాయదుర్గం	91,477
కళ్యాణదుర్గం	1,39,120



ఉరవకొండ వద్ద వరిగడ్డి తీసుకెళ్తున్న దృశ్యం

సబ్సిడీతో వరిగడ్డి ఇవ్వాలి



ప్రభుత్వం రైతులకు వరిగడ్డిను సబ్సిడీతో అందిస్తే ఎంతో బాగుటుంది. మార్కెట్లో గడ్డి ధర ఆకాశన్నంటుతుండడంతో కొనలేని పరిస్థితి ఉంటుంది. సబ్సిడీతో గడ్డి అందిస్తే పశువులకు గ్రాసం కొరత ఉండదు.

– వెంకటరెడ్డి, రాగులపాడు గ్రామం

రూ.వేలు వెచ్చించాల్సి వస్తోంది



ట్రాక్టర్ గడ్డి రూ.12 వేల ధర పలుకడంతో కొనలేని పరిస్థితి ఉంది. గతంలో గడ్డికి ఇంత డిమాండ్ ఎప్పుడూ లేదు. ప్రభుత్వం గడ్డి కేంద్రాలు ఏర్పాటు చేసి గడ్డి రాయితీతో అందిస్తే పశుపోషకులకు ఎంతో బాగుంటుంది.

– మారెన్న, విడపనకల్లు

మెగా జాబ్‌మేళా



జాబ్‌మేళాకు వచ్చిన నిరుద్యోగులతో మాట్లాడుతున్న మంత్రి కేశవ్

విడపనకల్లు: ఉరవకొండలో ఎస్‌కే జూనియర్ కళాశాల ఆవరణలో మంత్రి పయ్యావుల కేశవ్ ఆధ్వర్యంలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. దాదాపు 60 కంపెనీలు పాల్గొన్నాయి. పది, ఇంటర్, ఆపైన చదివిన నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మెగా జాబ్‌మేళా నిర్వహించినట్లు మంత్రి కేశవ్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్లకు పంపి, శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పించేలా ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఎంపిక పత్రాలు మంత్రి చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్, ఉరవకొండ తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని సీఅండ్ ఐజీ చర్చిలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఉమెన్స్ హెల్లోషిప్ అధక్షురాలు శోభారాణి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో క్రీస్తు పుట్టుక గూర్చి ముఖ్య ప్రసంగీకులు సీహెచ్ రాణి ముక్తి డేనియల్ ప్రసంగిస్తూ యేసు క్రీస్తు పాపులను రక్షించుడానికి ఈలోకానికి వచ్చారని అన్నారు. కార్యక్రమంలో సరోజినీ వసంతరావు, శాంత ఇజయ్య, ఎస్తేర్ రాణి చల్లా విద్యుల్లత చౌదరి, సుశీలమ్మ, శాంత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్షంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

- బెళుగుప్ప మండలం శీర్పి,కూడేరు మండలం రామచంద్రాపురం ఎన్నికలు వాయిదా
- మిగిలిన చోట్ల ఎన్నికలు ఏకగ్రీవం



కణేకల్లు డబ్ల్యూఏ అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందిస్తున్న రైతులు, నాయకులు

కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల పరిధిలో శనివారం సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అయితే ఎన్నికలను వైఎస్సార్‌సీపీ బహిష్కరించడంతో టీడీపీ నాయకులు ఏకపక్షంగా అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎంపిక చేసుకున్నారు.

కళ్యాణదుర్గం రూరల్: మండలంలో నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ముద్దినాయన పల్లి పంచాయతీలోని సాగునీటి సంఘంలో చైర్మన్‌గా వెంకటేశులు, వైస్ చైర్మన్‌గా నారాయణ, హులికల్లు పంచాయతీ సాగునీటి సంఘానికి చైర్‌పర్సన్‌గా లలితమ్మ, వైస్ చైర్మన్‌గా నవీన్, పాలవాయి గ్రామం సాగునీటి సంఘానికి చైర్మన్‌గా ఈశ్వరప్ప, వైస్ చైర్‌పర్సన్‌గా లక్ష్మీదేవి, చాపిరి పంచాయతీకి సాగునీటి సంఘానికి చైర్మన్‌గా కర్రిబసవన్న గౌడ్, వైస్ చైర్మన్‌గా అజిరత్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గుమ్మఘట్ట: మండలంలో సాగునీటి సంఘం ఎన్నికలు రసవత్తరంగా సాగాయి. కలుగోడు, గుమ్మఘట్ట, బేలోడు, భూపసముద్రం, రంగసముద్రం, పూలకుంట గ్రామాల్లో సాగునీటి సంఘాలకు అధికారులు ఎన్నికలు నిర్వహించారు. రంగసముద్రం డబ్ల్యూఏలో ప్రెసిడెంట్ కోసం టీడీపీ నాయకులు పోటీపడ్డారు. కలుగోడులో డబ్ల్యూఏలో ప్రెసిడెంట్‌గా కాలవ నాగరాజు, వైస్ ప్రెసిడెంట్‌గా టీ.హనుమక్క, రంగసముద్రం డబ్ల్యూఏలో ప్రెసిడెంట్‌గా జయరామిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా రాయంపల్లి శివారెడ్డి,భూపసముద్రం డబ్ల్యూఏలో ప్రెసిడెంట్‌గా గొల్ల నాగేంద్ర, వైస్ ప్రెసిడెంట్‌గా తలారి తిమ్మప్ప, పూలకుంట డబ్ల్యూఏలో ప్రెసిడెంట్‌గా గొల్ల తిప్పేస్వామి, వైస్ ప్రెసిడెంట్‌గా రుద్రముని , బేలోడులో డబ్ల్యూఏలో ప్రెసిడెంట్‌గా ఎన్.రామప్ప, వైస్ ప్రెసిడెంట్‌గా ఆర్‌కే తిప్పేస్వామి, గుమ్మఘట్ట డబ్ల్యూఏలో ప్రెసిడెంట్‌గా పార్వతమ్మ, వైస్ ప్రెసిడెంట్ పరమేశ్వరప్పలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ రామకృష్ణ,ఎంఈఓ రామచంద్ర,ఏఓ నిర్మల్‌కుమార్, పశువైద్యులు నవీన్‌కుమార్, జలవనరుల శాఖ ఏఈ ప్రణీత ప్రకటించారు. డీఎస్పీ రవిబాబు పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు.

బొమ్మనహాళ్: మండలంలో సాగునీటి సంఘం ఎన్నికలు శనివారం ముగిశాయి. మండలంలో 7 హెచ్చెల్సీ కాలువలు, మైనర్ ఇరిగేషన్ శ్రీధరఘట్ట చెరువు సంఘం ఎన్నికలు నిర్వహించారు. హరేసముద్రం కాలువ సంఘం అధ్యక్షుడు పయ్యావుల హనుమన్న, ఉపాధ్యక్షులు చంద్రగిరి హనుమంతరెడ్డి, బండూరు కాలువ అధ్యక్షులుగా నాగరాజు, ఉపాధ్యక్షులుగా వేలూరు గోవింద, ఉద్దేహాళ్ కాలువ అధ్యక్షుడిగా రావి రాజేష్, ఉపాధ్యక్షులుగా లాలెప్ప, కొలగానహళ్లి కాలువ అధ్యక్షుడిగా బి.గోపాల్, ఉపాధ్యక్షుడిగా కే వన్నూరుస్వామి, శ్రీధరఘట్ట కాలువ అధ్యక్షుడిగా కొండాపురం కేశవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున, కల్లుదేవనహళ్లి కాలువ అధ్యక్షుడిగా సుంకన్న, ఉపాధ్యక్షుడిగా ముక్కన్న, బొల్లనగుడ్డం కాలువ అధ్యక్షుడిగా చిన్న తిమ్మప్ప, ఉపాధ్యక్షుడిగా జగదీష్, శ్రీధరఘట్ట చెరువు అధ్యక్షుడిగా కే కృష్ణ, ఉపాధ్యక్షులుగా ఉప్పర వెంకటేశులు ఏకగ్రీవం ఎన్నికయ్యారు. నిర్వహణ అధికారులుగా తహసీల్దార్ మునివేలు, దాస్, సాయి కుమార్, వెంకటరెడ్డి, మల్లికార్జున, వీరన్న, అల్తాఫ్, శ్యామ్‌లు వ్యవహరించారు.

ఏకగ్రీవంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

కణేకల్లు: హెచ్చెల్సీకి అనుబంధమైన కణేకల్లు చెరువు, 43 ఉడేగోళం, బెణికల్లు సాగునీటి సంఘం ఎన్నికలు శనివారం ఏకగ్రీవమయ్యాయి. తొలుత రైతులు 12 మంది టీసీ మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం టీసీ మెంబర్లు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. కణేకల్లు చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా బీటీ రమేష్, ఉపాధ్యక్షుడిగా తిప్పేస్వామి, 43 ఉడేగోళం సాగునీటి సంఘం అధ్యక్షుడిగా దేవేంద్ర, ఉపాధ్యక్షులు ఏరసూల్ సాహెబ్, బెణికల్లు సాగునీటి సంఘం అధ్యక్షులుగా శంకరప్ప, ఉపాధ్యక్షులుగా హనుమంతప్పలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు తెలిపారు. మైనర్ ఇరిగేషన్‌శాఖ పరిధిలో ఉన్న కె.కొత్తపల్లి చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా రామిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా పెద్దిరెడ్డి, కోళకుర్తి చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా ఎర్రిస్వామి, ఉపాధ్యక్షుడిగా నాగభూషణంలు ఎంపికయినట్లు అధికారులు తెలిపారు.

ముగిసిన సాగునీటి సంఘాల ఎన్నికలు

శెట్టూరు: మండలంలో ఐదు తాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించగా అన్ని చోట్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. శెట్టూరు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా వన్నూర్ రెడ్డి, ములకలేడుకు సుబ్బరాయుడు, యాటకల్లుకు రాజన్న, కనుకూరుకు అజయ్‌కుమార్, తిప్పనపల్లికి కురుబ తిమ్మయ్య ఎకగ్రీవంగా ఎంపికైనట్లు తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ అధికారులుగా శ్రీధర్, వాసుకీరాణి, సురేంద్ర ప్రసాద్, విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో వర్గ విభేదాలతో ఎన్నిక వాయిదా

బెళుగుప్ప: మండల పరిధిలోని గంగవరం, శ్రీరంగాపురం గ్రామాల సాగునీటి సంఘాలకు శనివారం జరిగిన ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులే ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, శీర్పిలో టీడీపీ వర్గ విభేదాలతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. శీర్పి చెరువు పరిధిలో 111 మంది ఆయకట్టు సాగు రైతులు ఓటర్లుగా ఉన్నారు. ఇందులో ఆరుగురు టీసీ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంది. అయితే గ్రామంలో టీడీపీలోనే రెండు వర్గాలు ఉండటంతో తమకే అధ్యక్ష పదవి కావాలని భీష్మించడంతో ఇరు వర్గాలు కూడా ఎన్నికలకు దూరంగా ఉన్నారు. దీంతో ఎన్నికల నిర్వహణకు గ్రామానికి వెళ్లిన ఎన్నికల అధికారులు సభ్యులు రాకపోవడంతో ఎన్నికను వాయిదా వేసామని మండల ఎన్నికల ప్రత్యేకాధికారి సుధాకర్ పేర్కొన్నారు. శ్రీరంగాపురం రంగమ్మ చెరువు సాగునీటి సంఘం ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులు గంగప్ప అధ్యక్షుడిగా వన్నూరస్వామి ఉపాధ్యక్షుడిగా టీసీ సభ్యులు ఎం. లక్ష్మీదేవి, కె.లక్ష్మీదేవి, గంగాధర్, రత్నమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గంగవరం చెరువు సాగునీటి సంఘం అధ్యక్షులుగా టీడీపీ మద్దతుదారులైన రమాదేవిని అధ్యక్షుడిగా మల్లికార్జున ఉపాధ్యక్షులుగా టీసీ సభ్యులుగా శంకరప్ప, కరిబసప్ప, శ్రావ్య, సుజాతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీరంగాపురం, గంగవరం ఆయకట్టు దారుల సంఘాల అధ్యక్షులు టీసీ సభ్యులకు డిక్లరేషన్ ఫారాలను అధికారులు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ షర్మిళ, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఎంఈఓ మల్లారెడ్డి, ఏఓ పృథ్వీ సాగర్, ఈఓఆర్‌డీ నాగేశ్వరశాస్త్రి, ఎన్నికల నిర్వహణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం సాగునీటి సంఘం ఎన్నిక వాయిదా

కూడేరు: మండల పరిధిలోని మరుట్ల, ఇప్పేరు, అరవకూరు, రామచంద్రాపురం సాగునీటి సంఘాల ఎన్నికలను శనివారం నిర్వహించారు. కాగా రామచంద్రాపురం ఆయకట్టు పరిధిలో 114 మంది రైతులుండగా ఒక్కరూ ఎన్నికల్లో పాల్గొనలేదు. ఒక్క నామినేషన్ కూడా వేయకపోవడంతో ఎన్నిక వాయిదా వేసినట్లు డీటీ సూర్యప్రతాప్ తెలిపారు. మిగిలిన మూడింటిలో ఎన్నిక సజావుగా సాగింది. ఇప్పేరులో చైర్మన్‌గా పాండురంగయ్య, వైస్ చైర్మన్‌గా కుమ్మరి శివయ్య, మరుట్లలో చైర్మన్‌గా కరుణం శ్రీదేవి, వైస్ చైర్మన్‌గా మధుసూదన్ రెడ్డి, అరవకూరులో చైర్మన్‌గా బోయ ఈశ్వరయ్య, వైస్ చైర్మన్‌గా నరసింహులు ఎన్నికయ్యారు. కార్యక్రంలో ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, ఏఓ విజయకుమార్, సర్వేయర్ ఆయేషా సిద్ధిక్, ఇరిగేషన్ ఏఈలు సుధాకర్, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ పోస్టర్లు ఆవిష్కరణ



జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ చేతులమీదుగా పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

విడపనకల్లు: అభయ ఫౌండేషన్, నిస్వార్థ ఫౌండేషన్ సహకారంతో ఉచిత పోటీ పరీక్షల శిక్షణ పోస్టర్లను కలెక్టర్ వినోద్‌కుమార్ చేతులమీదుగా శనివారం విడుదల చేశారు. 2025 మార్చిలో పీఆర్‌జేసీ, పాలీసెట్, ఆర్టీటీ సెట్ పరీక్షలు రాసే విద్యార్థులకు 30 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు డిసెంబర్ 14 నుంచి జనవరి 15లోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులు తెలియజేశారు. కార్యక్రమంలో డీఈఓ ప్రసాదురావు, అభయ, నిస్వార్థ ఫౌండేషన్ నిర్వాహకులు చంద్రోశేఖర్, బండి శ్రీనివాసులు, ప్రతాప్, రాజేష్, చంద్రోశేఖర్, జయరాంనాయక్, శివరుద్ర, యుగంధర్, శర్మాస్, వాణి, నాగరత్న, లక్ష్మీదేవి, సంధ్య వెంకట్, స్వామి బాల చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అంజన్న రథోత్సవం

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని అంజనేయ స్వామి రథోత్సవాన్ని శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంలో ప్రతిష్టించారు. భక్తులు అంజన్న నామస్మరణతో రథాన్ని వెలుగు కార్యాలయం సమీపంలోని పాదాల కట్ట వరకు లాగారు.

విజేతలకు బహుమతులు

కుందుర్పి: స్థానిక కుసుమగిరి రైతు ఉత్పత్తి దారుల కంపెనీ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో 45 రోజులుగా మిల్లెట్ వంటకాల తయారీపై శిక్షణ పొంది ప్రతిభ కనబరచిన 25 మందికి సంస్థ శనివారం సర్టిఫికెట్లు అందజేసింది. కార్యక్రమంలో సంస్థ సీఈఓ నరసింహమూర్తి, అధ్యక్షుడు లక్ష్మీపతి, శిక్షకులు మృదుల, భారతి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రాయదుర్గంటౌన్: పట్టణ శివారు మొలకాల్మూరు చెక్‌పోస్టు వద్ద రాయదుర్గం ఎక్సైజ్ పోలీసులు 20 బాక్సుల కర్ణాటక మద్యం తరలిస్తున్న కారు, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మహేష్‌కుమార్ తెలిపారు. శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక నుంచి ఆంధ్రాకు తరలివస్తున్న 20 మద్యం బాక్సులు పట్టుబడినట్లు తెలిపారు. నాయకుల హనుమంతు, బోయ లింగప్ప, వరప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ ఎస్‌ఐ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే నీలినాలుక వ్యాధి నివారణ

బెళుగుప్ప: మేకలు, గొర్రెల్లో నీలి నాలుక వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి రమేష్ తెలిపారు. శనివారం మండలంలోని రమనేపల్లి గ్రామం వద్ద జీవాలు అనారోగ్యానికి గురి కావడంతో పశు వైద్యాధికారి పరిశీలించారు. జీవాల్లో నీలి నాలుక వ్యాధి లక్షణాలున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు విజయ్‌కుమార్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

విడపనకల్లు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మేలేరియా సబ్ యూనరిట్ ఆఫీసర్ కోదండ రామిరెడ్డి ప్రజలకు సూచించారు. శనివారం మండల కేంద్రంలో బీసీ కాలనీలో ఆరోగ్య సిబ్బందితో కలసి ఇంటింటా తిరుగుతూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.అంతకుముందు పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేశారు.

సంక్షిప్త సమాచారం

నూతన రథానికి విరాళం

విడపనకల్లు: ఉరవకొండలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి నూతన రథం నిర్మాణానికి భక్తులు రు.10,116 విరాళం అందించారు. విరాళం మొత్తాన్ని ఈఓ రమేష్‌బాబుకు అందజేశారు. ఉరవకొండకు చెందిన సల్లాపురం రామన్న, అనుమక్క జ్ఞాపకార్థం విరాళాన్ని అందించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రేపు ఉచిత గుండె వైద్య శిబిరం

కంబదూరు: కొత్త ఐపార్సుపల్లి గ్రామంలో దివంగత నీరుగంటి బజ్జన్న, అక్కమ్మల జ్ఞాపకార్థం ఈనెల 16న నిర్వహిస్తున్న గుండె వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ మాధవి, వైఎస్సార్‌సీపీ నాయకుడు భాస్కర్ శనివారం తెలిపారు. ఈ వైద్య శిబిరానికి ప్రముఖ కిమ్స్ సవేరా ఆస్పత్రికి చెందిన వైద్యులు వచ్చి గుండె జబ్బుతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కుష్టుపై ఆందోళనొద్దు

కూడేరు: కుష్టు వ్యాధి పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా లెప్రసీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ గంగాధర్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కుష్టు రోగుల కాలనీలో అంగవైకల్యం నివారణ-వైద్య పునరావాస శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స పొందితే పూర్తిగా నయమం చేయొచ్చని మెడికల్ ఆఫీసర్ గంగాధర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పారా మెడికల్ ఆఫీసర్ నాగన్న, డీపీఎంఓలు సత్యనారాయణ, తిప్పేస్వామి ,సూపర్‌వైజర్ రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ,ఏఎన్ఎం భాను, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలపల్లకీలో ఊరేగిన ఈశ్వరుడు

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడులో ఈశ్వర స్వామిని ముత్యాల పల్లకీలో వైభవంగా ఊరేగించారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని స్వామికి ఆలయంలో రుద్రాభిషేకం, సహస్రనామార్చన, పంచామృతాభిషేకం,˘మహా మంగళారతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి మూలవిరాట్‌ను ముత్యాలపల్లకీలో కొలువుదీర్చి, గ్రామంలో ఊరేగించారు. గలగల గ్రామంలో ఆంజనేయస్వామిని రథోత్సవంలో ఊరేగించారు.

భక్తిశ్రద్ధలతో దత్తాత్రేయ జయంతి

రాయదుర్గంటౌన్: కోటలో వెలసిన శంకరమఠంలో గురు దత్తాత్రేయ జయంతిని శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అర్చకులు వెంకటేష్ ప్రసన్నస్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. దత్తాత్రేయస్వామి మూలవిరాట్‌కు ఉదయం పంచామృతాభిషేకం, మహాన్యాస పారాయణం, ఏకాదశి వార రుద్రాభిషేకం, శ్రీదత్త వ్రతం, దత్త హోమం నిర్వహించారు.


రాయదుర్గంటౌన్: పట్టణంలోని షిర్డీ సాయినాథ ఆలయంలో దత్తాత్రేయ జయంతి ఆదివారం నిర్వహించనున్నారు. దత్త జయంతి ఉత్సవాలకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. శనివారం సాయంత్రమే ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం ఉదయం 6.30 గంటలకు కాకడాహారతి, 7.30 గంటలకు పంచామృతాభిషేకం, మంగళహారతి, 11 గంటలకు శ్రీమహాగణపతి, ఆదిత్యాది నవగ్రహ సహిత శ్రీసాయి దత్తమూలమంత్ర హోమం, మధ్యాహ్నం 12.30 గంటలకు మధ్యాహ్న హారతి, 1 గంటకు ప్రసాద వినియోగం, సాయంత్రం 6 గంటలకు పూల ధూపహారతి, 6.30 గంటలకు శ్రీసాయిభజన మండలి వారిచే సాయిభజన, రాత్రి 8 గంటలకు శేజ్ హారతి కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్ఎల్‌వీ రాధాకృష్ణ తెలిపారు.



సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

నేడు గురుదత్తా వేడుకలు

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో దత్తాత్రేయ స్వామి ఆశ్రమంలో ఆదివారం గురుదత్తా జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. శనివారం ఆశ్రమంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకం, అలంకరణ, వైరాగ్యానంద స్వామిజి పూజ, విష్ణు సహస్రనామం, శ్రీ విష్ణుసహస్రనామ హోమం పూజలు నిర్వహించారు. ఆదివారం గురుదత్త జయంతి, నామకరణం, డోలోత్సవం, ఉపనయనం, బిక్షాబియ్యం, గురుదత్త హోమం, మహాపూర్ణాహుతి తదితర పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



విశేష పూజలందుకున్న దత్తాత్రేయుడు

కూడేరు: మండల కేంద్రంలోని కోదండరాముల ఆలయంలో సీతారాముల, లక్ష్మన్న దేవతామూర్తులకు ఆలయ అర్చకులు భాస్కర్ శర్మ శనివారం ప్రత్యేక పూజలు చేశారు. తొలుత సీతారాములకు పాలాభిషేకం చేశారు. అనంతరం వివిధ రకాల పట్టువస్త్రాలు, పుష్పాలతో అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు.